




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

నేటి సందేశం
20 YEARS ANNIVERSARY
రేపటి పొద్దు జాడ

https://www.satyamdaily.net/

బుధవారం 4-6-2025

సంపుటి: 21 సంచిక: 61
పేజీలు: 8 వెల: రూ.1


# సివిల్ సర్వెంట్‌నవుతా!

- నాన్న ప్రేరణతోనే ఐఐటీ అడ్వాన్స్‌లో ఫస్ట్‌ర్యాంక్
- అమ్మ సెలవు పెట్టి మరీ అన్నం పెట్టేది
- ఆరో తరగతి నుంచీ ఐఐటీ వైపు అడుగులు వేయాలి
- 'సత్యం'తో మనోభావాలు పంచుకున్న ధర్మాన రుత్విక్ సాయి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**అప్పుడెప్పుడో 2018లో ఉమ్మడి జిల్లా పాలకొండకు చెందిన ఓ విద్యార్థికి జేఈఈ మంచి ర్యాంకు వచ్చింది. అది దేశం గర్వించదగ్గ ర్యాంకే. మళ్లీ ఇన్నాళ్లకు నరసన్నపేట మండలం దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయికి ఓబీసీ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు వచ్చింది. ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు వచ్చింది. 2018కి, ఇప్పటికి మధ్య సాంకేతికంగా మార్పులు వచ్చివుండొచ్చు. కానీ విద్యార్థుల మెదళ్లలో మాత్రం అప్పటికీ, ఇప్పటికీ జ్ఞానం స్థాయిలో విషం నిండిపోయిన మాట ఒప్పుకొనితీరాలి. ఒక చేతిలో మొబైల్, అందులో అన్‌లిమిటెడ్ డేటా, ఎదురుగా టీవీ, అందులో యూట్యూబ్ లేదా ఓటీటీ పెట్టుకొని ఒకేసారి డిజిటల్‌గా బిజీ అయిపోయిన ఈ తరంలో సెల్‌ఫోన్ ముఖం చూడకుండా ఆమధ్య సివిల్స్ సాధించిన ఒక వనిత కోసం చదివాం. ఇప్పుడు తాను కూడా సివిల్స్ వైపే వెళ్తానని, అందుకోసం ఇదే మార్గాన్ని ఎన్నుకున్నానని చెబుతున్న రిత్విక్ సాయి మంగళవారం 'సత్యం' కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జరిపిన ఇంటర్వ్యూ సారాంశమిది.**

**సత్యం:** మీరు ఐఐటీ, జేఈఈలో జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించారు. ఈ అద్భుతమైన విజయంపై మీ భావనలు ఏంటి?

**రుత్విక్ సాయి:** వాస్తవానికి ఆలిండియా లెవెల్‌లో 10లోపు ర్యాంకు వస్తుందని భావించాను. కానీ ఇంగ్లీష్‌లో ఉన్న ప్రశ్నపత్రాన్ని అర్థం చేసుకోడానికి నాకు పట్టిన సమయం ఎక్కువ కావడం వల్ల 18వ ర్యాంకుకు వెళ్లాల్సివచ్చింది. అయితే నా ముందున్న 17 మందీ నార్త్ ఇండియన్లే. వీరికి ఇంగ్లీష్ దాదాపు మాతృభాష లాంటిది. కానీ మన దగ్గర అలా ఉండదు. కాబట్టి ఫిజిక్స్‌లో 100 శాతం స్కోర్‌చేసినా, మ్యాథ్స్ సాల్వ్ చేసే సమయం తక్కువ తీసుకున్నా, అర్థం

- మిగతా చివరి పేజీలో



## హాల్‌టిక్కెట్ల గందరగోళం..

# అభ్యర్థుల్లో అయోమయం

- ఒకే అభ్యర్థికి 17న ఉదయం విజయవాడలో ఎస్‌జీటీ పరీక్ష
- మధ్యాహ్నం హైదరాబాద్ మేడ్చల్‌లో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పరీక్ష
- 6,8న వైజాగ్‌లో మ్యాథ్స్, 12న హైదరాబాద్‌లో లెక్కలు పరీక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరి మరికొద్ది రోజుల్లో ఏడాది పూర్తవుతుంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మొదటి సంతకం అయిన 100 రోజుల్లో మెగా డీఎస్సీకి కూడా దాదాపు ఏడాదే. 100 రోజుల్లో నోటిఫికేషన్ రాకపోయినా 16,347 పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఒకింత మానసిక ఒత్తిడికి గురి చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. జారీ చేసిన నాటి నుంచి కేవలం 45 రోజుల్లోనే పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయడం ఒక ఎత్తయితే, ఆ పరీక్ష నిర్వహణకు కావాల్సిన హాల్‌టిక్కెట్ల జారీలో గందరగోళం అభ్యర్థులకు మరింత ఆందోళన కలిగించే విషయం.

రాష్ట్రవ్యాప్తంగా 3,35,40111 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు వారి వారి అర్హతలను బట్టి నాలుగు లేదా ఐదు పోస్టులకు దరఖాస్తులు చేశారు. దీనివలన 5,77,417 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు ప్రక్రియలో అభ్యర్థులకు ఐదు ప్రాధాన్యాలలో పరీక్ష కేంద్రాలు ఎంపిక చేసుకోమని అవకాశం కల్పించారు. ఇందులో ఒక పరీక్ష ఒక పట్టణంలోను, ఇంకో పరీక్ష వేరే పట్టణంలోను రాసేవిధంగా హాల్‌టిక్కెట్లు జారీ చేశారు.

| POST & EXAM DATE - TIME | EXAMINATION CENTER NAME & ADDRESS |
| --- | --- |
| SGT 17-JUN-2025 9.30 AM TO 12.00 PM | SHREE VIJAYA DURGA I.T INFO SOLUTIONS, DOOR NO. 13-130 TANKASALA SUBBA RAO COLONY KANURU, DONKA ROAD, ENIKEPADU, VIJAYAWADA, AP-521108, |
| SA(NL) - SOCIAL STUDIES 17-JUN-2025 2.30 PM TO 5.00 PM | ION DIGITAL ZONE IDZ OLD ALWAL, ANANDA RAO PLAZA,LOYOLA COLLEGE ROAD, NEAR FATHER BALAIAH NAGAR BUS STOP,OLD ALWAL, MEDCHAL-MALKAJGIRI DIST, HYDERABAD, TG-500010, |
| TGT(L) - TELUGU 22-JUN-2025 9.30 AM TO 12.00 PM | SHREE VIJAYA DURGA I.T INFO SOLUTIONS, DOOR NO. 13-130 TANKASALA SUBBA RAO COLONY KANURU, DONKA ROAD, ENIKEPADU, VIJAYAWADA, AP-521108, |
| ENGLISH PROFICIENCY TEST 24-JUN-2025 4.00 PM TO 5.30 PM | SAI LAXMI COMPUTERS, 3RD FLOOR VASAVI PHARMA MARKET COMPLEX ,OPP TO AYAPPA SWAMY TEMPLE, GOLLAPUDI, VIJAYAWADA, AP-521225, |
| TGT(NL) - SOCIAL STUDIES (ENGLISH MEDIUM) 27-JUN-2025 9.30 AM TO 12.00 PM | LAKKIREDDY BALI REDDY COLLEGE OF ENGINEERING, L.B. REDDY NAGAR, DIST. KRISHNA, MYLAVARAM, AP-521230, |
| SA(L) - TELUGU 29-JUN-2025 2.30 PM TO 5.00 PM | LAKKIREDDY BALI REDDY COLLEGE OF ENGINEERING, L.B. REDDY NAGAR, DIST. KRISHNA, MYLAVARAM, AP-521230, |

CONVENOR OF AP DSC

ఇందులో ఇంకా విచిత్రమైన అంశం ఏమిటంటే.. ఒక అభ్యర్థికి ఒకేరోజు ఉదయం ఎస్‌జీటీ పరీక్ష విజయవాడలో, అదే రోజు మధ్యాహ్నం పాఠశాల సహాయకులు పరీక్ష హైదరాబాద్‌లో కేటాయించారు. ఒకేరోజు రెండు వేర్వేరు పట్టణాలలో పరీక్షా కేంద్రాలు కేటాయించడం ఎంతవరకు సమంజసం. కేవలం 2.30 గంటల వ్యవధిలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఎలా చేరుకుంటారో విజ్ఞులైన విద్యాశాఖాధికారులే ఆలోచించాలి.

ఒక మహిళా అభ్యర్థికి ఒకరోజు శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో టిజిటి - తెలుగు పరీక్ష, మరుసటి రోజు ఉదయాన్నే హైదరాబాద్‌లో పి.జి.టి. పరీక్ష ఉంది. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ చేరుకోడానికి రైలు ప్రయాణమే కనీసం 14 గంటలు పడుతుంది. అటువంటిది అభ్యర్థి హైదరాబాద్ చేరి, అక్కడి నుంచి ఎంతో దూరంలో ఉన్న ఆ పరీక్షా కేంద్రానికి సమయానికి ఏ విధంగా చేరుకుంటారో ప్రశ్నార్థకమైన అంశం.

ఏడాది వయసున్న చంటిపిల్లాడితో గల మహిళా అభ్యర్థి అన్ని సెంటర్లు హైదరాబాద్‌లో కేటాయించాలని అధికారులను ప్రాధేయపడుతున్నా ఈ నెల 6న టీజీటీ గణితం, ఒక రోజు వ్యవధితో పీజీటీ పరీక్షను విశాఖపట్నంలో, మరలా మూడు రోజుల వ్యవధిలో పాఠశాల సహాయకులు గణితం పరీక్షకు 12న హైదరాబాద్‌లో ఒక సెంటర్ కేటాయించారు. ఒక్కరోజు వ్యవధిలో చంటిపిల్లాడితో విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వరకు రెండుసార్లు ప్రయాణం చేయడం దుర్లభం. ఒక పరీక్ష రాయడానికి ఇన్ని ప్రాంతాలు తిరగడం అభ్యర్థులకు ఎంతో ఆర్థిక, వ్యయప్రయాసలతో కూడిన అంశం. ఇటువంటివి కోకొల్లలుగా హాల్‌టికెట్ల జారీలో లోపాలు ఉన్నాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖాధికారులకు అభ్యర్థులు వారి అన్ని పరీక్షలు ఒకే పట్టణంలో కేటాయించాలని కోరుకుంటున్నారు.


| POST & EXAM DATE - TIME | EXAMINATION CENTER NAME & ADDRESS |
| --- | --- |
| TGT(NL) - MATHEMATICS (ENGLISH MEDIUM) 06-JUN-2025 2.30 PM TO 5.00 PM | ADZ AROWANA DIGITAL ZONE, 58-20-41/2, MALLA SATISH COMPLEX,APSEB COLONY, BUTCHIRAJUPALEM,67 WARD,OPPOSITE SHIVALAYAM, NEAR NSTL DOUBLE ROAD, VISAKHAPATNAM, AP-530027, |
| PGT(NL) - MATHEMATICS (ENGLISH MEDIUM) 08-JUN-2025 2.30 PM TO 5.30 PM | ADZ AROWANA DIGITAL ZONE, 58-20-41/2, MALLA SATISH COMPLEX,APSEB COLONY, BUTCHIRAJUPALEM,67 WARD,OPPOSITE SHIVALAYAM, NEAR NSTL DOUBLE ROAD, VISAKHAPATNAM, AP-530027, |
| SA(NL) - MATHEMATICS 12-JUN-2025 9.30 AM TO 12.00 PM | NODECOP SOLUTIONS, H.NO. 2-4-497, SAI NAGAR, OLD HAFEEZPET, BESIDE ROYAL BAKERY, OPPOSITE MMTS RAILWAY STATION, MANJEERA ROAD, MIYAPUR, HYDERABAD, TELANGANA, INDIA, 500049, |
| SGT 17-JUN-2025 9.30 AM TO 12.00 PM | ION DIGITAL ZONE IDZ OLD ALWAL, ANANDA RAO PLAZA,LOYOLA COLLEGE ROAD, NEAR FATHER BALAIAH NAGAR BUS STOP,OLD ALWAL, MEDCHAL-MALKAJGIRI DIST, HYDERABAD, TG-500010, |
| ENGLISH PROFICIENCY TEST 24-JUN-2025 4.00 PM TO 5.30 PM | GMR INSTITUTE OF TECHNOLOGY, GMR NAGAR, SRIKAKULAM DISTRICT, RAJAM, AP-532127, |

CONVENOR OF AP DSC

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అందుబాటులో ఉన్న రోజుల్లో కూడా రొటీన్‌గా అభ్యర్థుల దరఖాస్తులను బట్టి పరీక్షా కేంద్రాలు నిర్ణయించడం సరికాదు. టెక్నాలజీని కనిపెట్టిన బాబు జమానాలో ఆయన కుమారుడు లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇటువంటి టెక్నికల్ తప్పిదాలు జరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. అన్నిటికీ మించి డీఎస్సీలో ఎదురైన ఇబ్బందులన్నింటినీ సరిచేసి ఉద్యోగాలు ఇవ్వాలని చూసినప్పుడు ఇటువంటి చిన్న లోపాలను కూడా సరిదిద్దితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. హాల్‌టిక్కెట్లు జారీ చేసిన తర్వాత ఈ కేసులో జోక్యం చేసుకోలేమంటూ సాక్ష్యాత్తు రాష్ట్ర హైకోర్టే వ్యాఖ్యానించిన నేపథ్యంలో హాల్‌టిక్కెట్ల జారీయే ప్రధాన సమస్య అవడం గమనార్హం.

" నేను నా పని సవ్యంగా చేస్తున్నాను.. ప్రతీసారి క్రమం తప్పకుండా బటన్ నొక్కి పథకాలు అందేటట్టు చేస్తున్నాను.. మీరు కూడా నియోజకవర్గాల్లో పని చేస్తే ఫలితాలు బాగుంటాయి. "

...ఇదీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓ బహిరంగ సభలో బటన్ నొక్కుతూ చేసిన ప్రసంగం. బటన్ నొక్కడమే ముఖ్యమంత్రి పని అని, మిగిలిన విషయాలు పట్టించుకోనక్కర్లేదని, తన వల్ల రాష్ట్రంలో ఏదైనా కుటుంబానికి మేలు జరిగితేనే ఓట్లేయాలని, లేదంటే వేరే పార్టీకి వేసుకోవచ్చని ధీమాగా చెప్పిన సందర్భం ఇది. అయితే సరిగ్గా ఈవీఎంలలో అదే బటన్ బద్దలై కూటమి ప్రభుత్వానికి 165 స్థానాలు వచ్చి సరిగ్గా నేటికి ఏడాది.



# బటన్ బద్ధలైన రోజు

- సీనియర్లను కాదన్నందుకు ఫలితం
- పార్టీ, ప్రభుత్వం వేరన్న శైలికి చెంపపెట్టు
- ఎన్నికల ఫలితాలు విడుదలై ఏడాది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత ఏడాది జూన్ 4న వచ్చిన ఎన్నికల ఫలితాలు చూస్తే జగన్మోహన్‌రెడ్డి ఉదాశీన పాలనకు, బాధ్యతారాహిత్యానికి అవసరమైన దానికంటే ఎక్కువగానే శిక్షించారని నిరూపించిన రోజు. ఎన్ని ఎక్కువ సీట్లిచ్చారో తిరిగి అన్ని తక్కువ సీట్లతో మూలన కూర్చోబెట్టిన రోజు. కూటమి అధికారంలోకి వచ్చిందని తేల్చిన రోజు. కాకపోతే ఏడాదైనా ఇప్పటికీ తెలుగుదేశం నేతలు జగన్మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నవారినే విమర్శిస్తూ కాలం నెట్టుకొస్తున్నారు.

జూన్ 12న కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. లెక్క ప్రకారం ప్రభుత్వం ఏర్పడి అప్పటికి ఏడాది. కానీ జూన్ 4 ఈవీఎంలలో బటన్ బద్దలైన రోజు. ఏ బటన్ నొక్కి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సుభిక్షం చేశారని భావించారో అటువంటి బటనే ఈవీఎంలలో నొక్కి జనాలు ఆయనకు అధికారం దూరం చేశారు. అయితే విచిత్రం ఆ ఈవీఎం బటన్లపైనే జగన్మోహన్‌రెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు.. అది వేరే విషయం. ఎన్నికల ముందు పాదయాత్రలో జనాల హృదయాలు గెలుచుకున్న జగన్మోహన్‌రెడ్డి ఒక పాలకుడిగా మాత్రం విఫలమయ్యారని నిర్ణయించడానికి ఐదేళ్లు అవసరం పడలేదు. కాకపోతే ఆయన నిరంకుశ విధానాల వల్ల, ఆయన పార్టీలో వీర విధేయుల వల్ల అసమ్మతి, అసంతృప్తి బయటపడకుండా అణచగలగారు గానీ, రెండున్నరేళ్లకు కేబినెట్‌ను మార్చిన సమయానికే ప్రభుత్వం మీద వ్యతిరేకత మొదలైంది. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఆయన ఇచ్చిన హామీల అమలు కోసం అడుగులు వేసిన జగన్మోహన్‌రెడ్డి అతి తక్కువ కాలంలో జనాభిమానానికి దూరమవడానికి కారణం ఆయన పార్టీ వేరు, ప్రభుత్వం వేరని భావించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే. తెలుగుదేశం సానుభూతిపరుల కోణంలో అమరావతి రాజధాని రద్దు, సీపీఎస్ రద్దు చేయకపోవడం, 45 ఏళ్లకు పెన్షన్ ఇవ్వకపోవడం, యువతకు వైన్‌షాపులు, ఫిష్ ఆంధ్రాలో మాత్రమే ఉపాధి చూపించడం వంటివి జగన్ ఓటమికి కారణాలు కావచ్చు గానీ, అంతకు మించి పార్టీలో పనికొచ్చే నేతలను పక్కన పెట్టి కేవలం తన భజనపరులకు మాత్రమే అందలమెక్కించి ఎవరి సూచనలూ పట్టించుకోకపోవడం వల్ల జరిగిన నష్టమిది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో పోల్చిచూస్తే జగన్మోహన్‌రెడ్డి తొలి ఏడాది బాగానే పరిపాలించినట్టు కనిపిస్తుంది. అయినా కూడా జగన్మోహన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే రావడం వెనుక సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతలను ఆయన తొక్కిపెట్టేయడమే. తన వల్లే అధికారంలోకి వచ్చారని, తలపండిన నేతలు కూడా తనవల్లే గెలిచారని భావించడం వల్లే కేవలం జగన్ వల్లే 2024లో 11 సీట్లకు ఆ పార్టీ పరిమితమైపోయింది.

జిల్లాలో ధర్మాన ప్రసాదరావు వంటి రాజకీయ ఉద్ధండుడికి సైతం ముఖ్యమంత్రిని కలవాలంటే నెలలు తరబడి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, కేంద్రంలో లాబీయింగ్ చేయగల సత్తా ఉన్న మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి వంటి నేతలకు బీజేపీ అనే ఆప్షన్ ఉన్నా ఏరికోరి వైకాపాలో చేరినా గుర్తింపు దక్కలేదు సరికదా.. ఆమెకు పోటీగా అక్కడ బలం లేని నాయకత్వానికి ఊపిరి లూదడం, తన సామాజికవర్గానికి చెందిన రెడ్లను తీసుకువచ్చి జిల్లా మీద ఆధిపత్యాన్ని అప్పగించడం వంటివి ఈ జిల్లాలో వైకాపా క్లీన్ స్వీప్ అవడానికి ప్రధాన కారణాలు. 2029 ఎన్నికల్లో కూడా జగన్మోహన్‌రెడ్డి తన వల్లే అంతా జరగాలని భావిస్తే, రాజకీయంగా ఇక్కడ కొన్ని శక్తులు, కొందరు వ్యక్తులు సమాధి అయిపోతారు. అటువంటి వారిని బతికించి జిల్లాలో రాజకీయ చైతన్యం తీసుకురావడం కోసం ధర్మాన అనారోగ్యం పేరుతో అలకపాన్పు మీద ఉన్నారు. కారణం.. చివరి నిమిషంలో భావోద్వేగాల పేరుతోనో, రాజకీయ సమీకరణాలు కుదరలేదనో వేరే వారికి పగ్గాలిస్తే ఇక్కడ రాజకీయాలు చేయడం అవసరమనే భావన ధర్మానలో ఉంది. ఇది వాస్తవం కూడా. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఎన్నిసార్లు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టాలని చూసినా ఆ అవకాశం జగన్మోహన్‌రెడ్డి ఇవ్వలేదు. కేవలం మీతో ఒక్క ఫొటో అని కబురంపితే కలవడం మినహా జిల్లా రాజకీయాలపై సీనియర్లతో చర్చించిన పాపాన పోలేదు. ధర్మాన 2019లో ప్రభుత్వం ఏర్పాటైన మొదట్నుంచి ప్రభుత్వాలు వ్యాపారాలు చేయకూడదని ఓపెన్‌గానే చెబుతూవచ్చారు. ఇసుక, మద్యం వంటి విషయాల్లో వేలు పెట్టకూడదని, ఇటువంటి పాలసీలకు తాను వ్యతిరేకమని చెప్పేవారు. సరిగ్గా ఇప్పుడు అదే మద్యం పాలసీ జగన్మోహన్‌రెడ్డి మెడకు చుట్టుకుంది. సీఎంవోలో అప్పటి మద్యం పాలసీపై సంతకం ఉందని నిరూపించే దమ్ముందా అని జగన్మోహన్‌రెడ్డి మీడియాను ప్రశ్నిస్తుండొచ్చు గాక.. కానీ సగటు ఓటరు మాత్రం మద్యం కుంభకోణం విషయంలో

- మిగతా చివరి పేజీలో






## మాజీ మంత్రి బొత్సకు అస్వస్థత




(సత్యంన్యూస్, విజయనగరం)

వైకాపా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. వైకాపా ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలారు. మైకులో మాట్లాడుతుండానే అస్వస్థతకు గురవడంతో పార్టీ నేతలు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయపురం నుంచి స్థానిక మూడురోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో బొత్స పాల్గొన్నారు. ఎండవేడి ఎక్కువగా ఉండటంతో ఆయన వడదెబ్బకు గురైనట్లు తెలుస్తోంది.




• ఎడిటోరియల్

# పుట్టగతుల్లేని మహిళా నేతల పార్టీలు!

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఇంటి పోరు తారస్థాయికి చేరింది. పార్టీలో తన స్థానం ఏమిటో స్పష్టం చేయాలంటూ కేసీఆర్ కుమార్తె కవిత తన సొంత అన్న కేటీఆర్‌పైనే యుద్ధం ప్రకటించడం ఆ పార్టీలో తీవ్ర కలవరం రేపుతోంది. చివరికి అది కవిత సొంత కుంపటి పెట్టే దిశగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ ఏర్పాటు దిశగా ఇప్పటికే ఆమె తెలంగాణ జాగృతిలోని తన సన్నిహిత నేతలతో మంతనాలు జరుపుతున్నారట! రేపో మాపో దీనిపై స్పష్టత వస్తుందంటున్నారు. అయితే నాడు ఉమ్మడి ఏపీలో గానీ.. ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లో గానీ సొంత పార్టీలు పెట్టిన మహిళామణులు వాటిని నడపడంలో ఫెయిలయ్యారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ మరణం తర్వాత 1996లో లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. టీడీపీలో అధికార మార్పిడి నేపథ్యంలో చంద్రబాబుతో విభేదించిన 28 మంది ఎమ్మెల్యేలతో కలిసి ఆమె ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. కానీ 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో గానీ, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో గానీ ఒక్క సీటైనా గెలవలేదు. ఇక 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరులో పోటీ చేసిన లక్ష్మీపార్వతికి కేవలం 946 ఓట్లే వచ్చాయి. దాంతో 2016లో ఎన్టీఆర్ టీడీపీ గుర్తింపును ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఆమె వైకాపాలో చేరిపోయారు. తెలుగుదేశం పార్టీ నుంచి రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా పని చేసిన రేణుకా చౌదరిని పార్టీ నుంచి బహిష్కరించడంతో టీడీపీ-2 పేరుతో పార్లమెంటులో సొంత పార్టీ ప్రకటించారు. ఎంపీ పదవిని కాపాడుకునేందుకే ఏర్పాటు చేసిన ఈ పార్టీలో ఇద్దరు రాజ్యసభ సభ్యులు ఉండేవారు. అయితే లక్ష్మీపార్వతి వివాదం తర్వాత టీడీపీ చంద్రబాబు నాయకత్వంలోకి మారడంతో టీడీపీ-2ను రద్దు చేశారు. కానీ చంద్రబాబు తనకు ఏ పదవి ఇవ్వకపోవడంతో టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక సినీ రంగంలో రాణించిన విజయశాంతి రాజకీయాల్లో మాత్రం రాణించలేకపోయారు. 1998లో బీజేపీలో చేరిన ఆమె ఆ పార్టీనుంచి బయటకొచ్చి 2005 జనవరిలో తల్లి తెలంగాణ పేరుతో పార్టీ స్థాపించారు. కానీ ఈ పార్టీ ప్రజల మద్దతు పొందడంలో సక్సెస్ కాలేదు. తెలంగాణవాద పార్టీల ఏకీకరణలో భాగంగా 2009లో తల్లి తెలంగాణ పార్టీని టీఆర్ఎస్(ఇప్పటి బీఆర్ఎస్)లో కలిపేశారు. టీఆర్ఎస్ తరపున మెదక్ ఎంపీగా పని చేసిన విజయశాంతి తర్వాత కాలంలో కేసీఆర్‌తో విభేదించి టీఆర్ఎస్‌ను వీడారు. తర్వాత అనేక పార్టీలు మారుతూ ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ఎమ్మెల్సీగా ఉన్నారు. ఒకప్పటి డిప్యూటీ కలెక్టర్, వ్యాపారవేత్త, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత స్థాపించిన జన జాగృతి పార్టీదీ ఇదే పరిస్థితి. 2014లో వైకాపా నుంచి అరకు ఎంపీగా గెలిచిన గీత తర్వాత కాలంలో ఆ పార్టీకి దూరమయ్యారు. ఆమె బీజేపీలో చేరతారనే ప్రచారం జరిగినా.. జన జాగృతి అనే పార్టీ స్థాపించారు. కానీ చివరికి కాడి దించేసి బీజేపీలో చేరిపోయి 2024 ఎన్నికల్లో అరకు ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత నుంచి సైలెంట్ అయిపోయారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల తన అన్న, వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తనకు గుర్తింపు ఇవ్వలేదని అలిగి ఏపీ రాజకీయాలకు దూరమయ్యారు. 2021 జులైలో తెలంగాణ వైఎస్ఆర్ పార్టీని స్థాపించారు. కానీ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం పరిణామాల్లో తన పార్టీని చాప చుట్టేసి కాంగ్రెస్‌లో విలీనం చేశారు. తాను కూడా తెలంగాణ నుంచి బిచాణా ఎత్తేసి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలిగా కొత్త అవతారం ఎత్తారు. వీరితోపాటు చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి స్థాపించిన జై సమైక్యాంధ్ర పార్టీ, ఒకప్పటి టీడీపీ నేత దేవేందర్ గౌడ్ స్థాపించిన నవతెలంగాణ పార్టీలు కూడా ప్రభావం చూపకుండానే కాలగర్భంలో కలిసిపోయాయి. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత వీరందరి బాటలోనే తండ్రి, అన్నల నాయకత్వంలోని కొత్త పార్టీపై ధిక్కార స్వరం వినిపిస్తూ కొత్త పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మహిళలు స్థాపించిన పార్టీలన్నీ ఫెయిల్ అవుతుండడం ఆందోళన కలిగిస్తుందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురుషాధిక్య సమాజం మహిళలను పార్టీ అధినేతలుగా ఒప్పుకోలేకపోతుందన్న అభిప్రాయం కొంతమందిలో ఉంది. అయితే మహిళా నేతలు పార్టీ పెట్టిన సమయంలో సరైన లీడింగ్ ఫ్యాక్టర్ లేకపోవడం, ఎమోషన్‌లో పార్టీలను అనౌన్స్ చేసేయడం, దీర్ఘకాలం పాటు పార్టీని నడిపే వ్యూహం లేకపోవడం వల్లే పార్టీలు దెబ్బతింటాయని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కవిత పార్టీ పెడతారా? పెడితే దాన్ని విజయవంతంగా నడపగలరా? కాలమే సమాధానం చెప్పాలి.

## సాటివారి ఆకలి తీరుద్దాం.. ఆనందంగా జీవిద్దాం

**- అన్నవితరణలో లయన్స్ కెఎన్ఎస్వీ. ప్రసాద్**

**- ఘనంగా హారిక ప్రసాద్ జన్మదిన వేడుకలు**

(సత్యంన్యూస్,, శ్రీకాకుళం)

అన్నవితరణలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదని ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపకులు కెఎన్ఎస్వీ ప్రసాద్ (హరికా ప్రసాద్) బుధవారం అన్నారు. హరికాప్రసాద్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల రిమ్స్ ఆవరణలో సత్యసాయి అన్నపూర్ణ సేవా మందిరంలో రోగులకు, సహాయకులకు, నగరంలో నైట్ షెల్టర్, పలు ముఖ్య కూడలిలో నిరుపేదలకు కుటుంబసమేతంగా అన్నవితరణ చేపట్టి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యాగతి సేవ, ఆపన్నులకు, ఆకలితో బాధపడేవారికి అన్నప్రసాదాన్ని అందించే వారికి ఆహారానికి లోటుండదన్నారు. అన్నదానం కోటి గోవుల దాన ఫలితమన్నారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్, హారిక ప్రసాద్ సతీమణి శోభారాణి మాట్లాడుతూ హారికప్రసాద్ సేవా తత్పురుషులని, ఆయన సేవలతోనే ఎక్కువ కాలం గడిపారని, లేనివారికి సహాయపడాలని మాతో చెప్తుంటారన్నారు. "దానాలన్నింటిలోకెల్లా అన్నదానం మిన్న ని" దానికి మించిన దానం మరొకటి లేదని, ఆకలితో ఉన్నవారికి, అనాధలకు, పేదలకు, రోగులకు, వికలాంగులకు, అన్నవస్త్రాదులు మొదలైనవి లేనివారికి దానం చేస్తే ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. లేనివాడికి పట్టెడు అన్నం ప్రేమతో పెడితే వారి కళ్ళల్లో ఆనందం చూస్తామని ఈ జీవితానికి ఇంతకన్నా ఇంకేం కావాలన్నారు. ఆకలి బాధ అందరికీ ఒకేలాగే ఉంటుందని, సాటివారి ఆకలి తీరుద్దాం, అన్నాన్ని గౌరవిద్దాం, నలుగురిని అక్కున చేర్చుకుందాం, ఆనందంగా జీవిద్దామన్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు చందక నీహర్‌నాయుడు, డాక్టర్ హరికా, డాక్టర్ మౌనీష్, డాక్టర్ సత్యస్వరూప్, లక్ష్మణ్, సుమన్, లయన్స్ క్లబ్ హర్షవల్లి సభ్యుల బృందం పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి

8019 221 221

## 5 నుంచి మసుల బీచ్ ఫెస్టివల్

(సత్యంన్యూస్, మచిలీపట్నం)

ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు మంగినపూడి బీచ్‌లో మసుల బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ఏపీ టూరిజం శాఖ అధికారులు పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరిగే ఈ ఫెస్టివల్‌లో ఆటలు, పాటలు, కేరింతలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. అదే విధంగా జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు, కయాకింగ్, కానోయింగ్ పోటీలు. అలాగే మన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంప్రదాయ హస్త కళల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు హరిహర వీరమల్లు, రాజాసాబ్ చిత్రాలకు చెందిన బృందాలతోపాటు సంగీత దర్శకులు సాయికార్తీక్, గాయకులు రామ్ మిరియాల, గీతామాధురి, జబర్దస్త్ నటులు హైపర్ ఆది, బుల్లెట్ భాస్కర్, సునామీ సుధాకర్, రైజింగ్ రాజు, ఫైమా యాంకర్ ఉదయ భాను, డాన్సింగ్ క్వీన్ ఆక్సఖాన్, జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావ్, యాంకర్ మృదుల, రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్ రాము రాథోడ్, లిఖిత, సింగర్ ప్రభ గారు హాజరవుతారన్నారు. అమ్యూజ్ మెంట్ రైడ్స్, హెలికాప్టర్ రైడ్స్, కోలాటం, డప్పు నృత్యం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యే వారికి మచిలీపట్నం నుంచి మంగినపూడి వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



(సత్యంన్యూస్, కొత్తూరు)

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సరిహద్దు ప్రాంతమైన బలద గ్రామంలో మాధవ హరి అనే వ్యక్తి ఇంటిదగ్గర అక్రమంగా నిల్వ ఉంచిన 48 బస్తాలతో ఉన్న సుమారు 2400 కిలోల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి బియ్యంను సరుబుజ్జిలి ఎమ్మెల్యేస్ పాయింట్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణరావు, రాజగోపాల్ తదితరులున్నారు.



వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా పాలకొండ శాఖా గ్రంథాలయంలో 38వ రోజు స్వర్ణఆంధ్ర-2047 అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 12మంది విద్యార్థులు పాల్గొన్నారు. దీంతోపాటు మట్టి బొమ్మల పోటీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.


- సత్యంన్యూస్, పాలకొండ

## వాసు మాస్టార్‌కు ఘన సన్మానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన క్లబ్ గౌరవాధ్యక్షులు వాసు మాస్టర్‌ను రైజింగ్‌స్టార్ వాకర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈమేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల శ్రీకాకుళం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసు మాస్టార్‌ను క్లబ్ సభ్యులు దుశాలువ, మెమెంటో, పుష్పగుచ్చము అందించి ఆత్మీయ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ పైల రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ అధ్యక్షులు ఎంఎస్ఆర్ మూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగుతూ గురువు స్థానం పవిత్రమైనదన్నారు. ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన వాసు మాస్టార్‌కు పదోన్నతి రావడం ఆనందకరమన్నారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ప్రధాన ఉపాధ్యాయులుగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో క్లబ్ తరపున సన్మానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కూన వెంకట రమణమూర్తి, కోశాధికారి జినగ పార్వతీశం, ఉప కార్యదశి దువ్వాడ రమణ, డైరెక్టర్లు ఎ.వెంకటరావు, కేఎన్ అప్పారావు, జీవీ సత్య నారాయణ, పి.గంగాధర్‌రావు, పీవీ రమణ, ఎస్.రాజు, కేజీఎన్ అప్పారావు, టి.గోవిందరావు, జి.ప్రకాశ రావు తదితరులున్నారు.





సంగీత సాగరాన్ని మథించి గీతామృతాన్ని ప్రపంచానికి పంచిన స్వర తపస్వి ఇళయరాజా. మ్యూజికల్ వర్డ్స్‌తో... రాసే ... పాటకు ఓ వాతావరణం సృష్టించడం వేటూరి లక్షణం. ఈ ఇద్దరి కాంబినేషన్ వర్ధిల్లిన ఎనభై, తొంభై దశకాల తెలుగు సినిమా పాటలు ఇప్పటికీ ఎప్పటికీ మన స్మృతి పథం నుంచి చెరిగిపోవు. కళాతపస్వి విశ్వనాథ్‌తో శంకరాభరణం తర్వాత పూర్ణోదయా సంస్థ నిర్మించిన చిత్రం సాగరసంగమం. నరుడి బ్రతుకు నటన ఈశ్వరుడి తలపు ఘటన అంటారు వేటూరి, ఇళయరాజాలు. క్లిష్టమైన సన్నివేశం... జీవితానురక్తి లేని కథానాయకుడు పాడుకునే మనో ధర్మ గీతం. అతని కోసం తల్లడిల్లే కథానాయిక హృదయ వేదననూ పాటలో పట్టివ్వాలి. అలాంటి ఫీట్స్ చేయడం అంటే ఇళయరాజాకు మహా ఇష్టం. అలాంటి సన్నివేశం దొరికినప్పుడు కదా...మన సార్ధకత అనుకుంటారాయన. సురేష్ మూవీస్ కమల్‌తో తీసిన ఇంద్రుడు చంద్రుడు కోసం...ఇళయరాజా వేటూరి అల్లిన అందమైన డ్యూయట్ సంధ్యారాగపు సరిగమలో తొలి కలయికలో.. డ్యూయట్లను సీరియస్‌గా పట్టించుకోంగానీ అందులోనూ అద్భుతమైన అర్థవంతమైన సాహిత్యాన్ని సంగీతాన్ని అందించిన కారణ జన్ములు ఇద్దరూ. స్వీట్ నథింగ్స్‌నే.. అందమైన స్వరంలో చెప్పగలగడం ఇళయరాజా స్పెషాలిటీ. ఆ విషయాన్ని ప్రస్ఫుటంగా చెప్పే గీతమే ఇది. ఎటో వెళ్లిపోయింది మనసు...

# విలక్షణ రాజా!

ఈ తరం మీదనూ... ఇళయరాజా సంగీత మాయాజాలాన్ని చలాయించిన మూవీ. ఇళయరాజా బాణీ నేరుగా హృదయాలను తాకుతుంది. కవ్విస్తుంది... మురిపిస్తుంది... బాధిస్తుంది... లాలిస్తుంది... అనుభూతిని కలిగించడమే...ఉత్తమ సంగీత లక్షణం.

ఆయన విషాద గీతం చేస్తే జన హృదయాలు బాధగా మూలుగుతాయి. ఆయన హుషారైన పాట కంపోజ్ చేస్తే మనసులు లేడి పిల్లల్లా చెంగున ఎగురుతూంటాయి. అందుకు... ఆయన పాటలే సాక్షం. ప్రపంచాన్ని చూడలేని కవిత... నిజం చూడదు... ఇసుకలోన తల దూర్చిన ఉష్ట్రపక్షి బాపతు అన్నాడు శ్రీశ్రీ. దాన్ని వివరించే ప్రయత్నమే సింధు భైరవిలో పాడలేను పల్లవైన గీతం. శాస్త్రీయ సంగీత కచేరీ జరుగుతున్న చోటకు వచ్చి కళ కళ కోసమేనా? అని ప్రశ్నించే ఓ ఆడపిల్ల.

ఇటీవలే కన్నుమూసిన దర్శక దిగ్గజం బాలచందర్ అపూర్వ సృష్టి సింధు భైరవిలో చిత్ర గళంలో వినిపించిన పాడలేను పల్లవైన... కవీ ఓ కళాకారుడా ప్రజలవైపా? ప్రభుతవైపా.. అని గోర్కీ సంధించిన ప్రశ్న నేపధ్యంలో సాగే కథాంశంతో నిర్మించిన చిత్రం రుద్రవీణ. తండ్రి ఆలోచనా సరళిని మార్చాలనుకునే కొడుకు... తండ్రి నుంచి బిళహరి రాగాన్ని లాగేసుకున్న దాష్టీకం మీద చేసిన తిరుగుబాటు ఈ గీతం. పేరు లేక పేదదౌన? మోగుతున్న రాగవీణ అంటూ సాగే సీతారామశాస్త్రి సాహిత్యానికి ఇళయరాజా చేసిన స్వరాలంకారం వినితీరవలసినదే. చెబితే తప్ప తెలియని డబ్బింగ్ గీతం రానేలా వసంతాలే...

దక్షిణ భారత దర్శక అద్భుతం బాలచందర్ రూపకల్పనలో వచ్చిన డాన్స్ మాస్టర్ మూవీలోదీ పాట. పహాడి రాగంలో ఇళయరాజా చేసిన ఈ వేటూరి గీతం నిజంగానే ఓ అందమైన ప్రేమలేఖలా సాగుతుంది. దేవేంద్రుని కుమార్తె భూలోకం చూడాలని వచ్చిన సందర్భానికి వేటూరి రాసిన గీతం *అందాలలో అహో మహోదయం....* ఇళయరాజా అద్భుతరసంలో స్వరపరచిన ఈ గీతం వింటుంటేనే కళ్లెదుట సుందరలోకాలు పురుడు పోసుకుంటాయి. మరి మనమూ.. ఓసారి ఆ అందాల లోకాల్లో అతిలోకసుందరి... జగదేకవీరులతో కలసి విహారము చేసెదమా? వంశీ ఇళయరాజా...ఈ కాంబినేషన్ అంటే తెలుగోళ్లకు యమక్రేజు.

సితారతో మొదలైన ఈ ఇద్దరి స్వరసాంగత్యం వెన్నెలా గోదావరిలా అలా కొనసాగుతూనే ఉంది. రాజా నుంచి టిపికల్ ట్యూన్లు రాబట్టడంలో వంశీ స్పెషలిస్టు. అలా వచ్చిన బాణీ ఆలాపన చిత్రంలో వినిపిస్తుంది.. *ప్రియతమా..* అంటూ సాగే ఇళయరాజా మార్క్ గీతాన్ని వినండి...

హీరోయిన్ పేరు లలిత... తన పేరు చెప్పకుండా కథానాయకుణ్ణి తికమక పెట్టేస్తుంటుంది. శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న ఆ కథానాయకుడికి తన పేరేమిటో తెలుసుకోమని ఆలాపన చేస్తుంది. హీరో అర్థం చేసుకుంటాడు. తనకెంతో నచ్చిన లలిత రాగంలో ఆనందాన్ని పంచుకుంటాడు. రుద్రవీణ చిత్రం నుంచి... *లలిత ప్రియకమలం...* చూడండి. *తానాలే చేసాను నేను నీ స్నేహంలో.... ప్రాణాలే దాచావు..నీవు నా మోహంలో....* జైల్లో మగ్గిపోతున్న ఓ హృదయ వేదన ఈ గీతం.

పాట వింటున్నంత సేపూ ఓ చిన్నపెయిన్... మనసుల్ని మెలితిప్పుతూ ఉంటుంది. ఇళయరాజా సంగీతంలో ఉండే గొప్పతనమే అది. రాజా సంగీతంలో కలగలసిన ఆత్రేయ సాహిత్యం వినండి.

కమర్షియల్ సినిమానే అయినా... క్రియేటివ్‌గా తీయాలనే తపనున్న ప్రొడ్యూసర్ కె.ఎస్.రామారావు. ఆ తపనే...అభిలాషే.... ఇళయరాజాతో తొలి స్ట్రెయిట్ చిత్రానికి సంగీతం అందించేలా చేసింది. ఇళయరాజా, వేటూరి, లోక్‌సింగ్, చిరంజీవి అనే ఆ నలుగురు కల్సి పంచిన సంగీతామృతం...*కరిగిపోయాను కర్పూర వీణలా...* కీరవాణి రాగంలో ఇళయరాజా వంశీ కలసి చేసిన సుస్వర విందు.. అన్వేషణలోని కీరవాణీ అంటూ సాగే గీతం. వేటూరి.. ఇళయరాజా.. వంశీ...త్రివేణీ సంగమం.

ఈ పూలలో అందమై...ఈ గాలిలో గంధమై...వినేయండి.. మాటలకందని మాధుర్యం.. ఇళయరాజా సంగీతం.. ఏసుదాసు గానం.. కళ్ల ముందు సాయిని సాక్షాత్కరింపచేసే గీతం.. *సాయి శరణం...బాబా శరణం. సాయి చరణం గంగా యమున సంగమ సమానం...* నిజంగానే... ఆత్రేయ... ఇళయరాజాల సంగమం కూడా గంగా యమున సంగమ సమానమే.

విరహ గీతాలు రాయాలన్నా...విషాదాన్ని పలికించాలన్నా... ఆత్రేయే రావాలి.. ఈ నమ్మకాన్ని నిలబెట్టిన గీతాల్లో ఒకటి అభినందన చిత్రంలో వినిపిస్తుంది. ఆత్రేయ మనసెరిగి ఇళయరాజా కూర్చిన స్వరం అది. *ప్రేమలేదని... ప్రేమించరాదని...* వినండి....

దర్శకుడు గీతాకృష్ణకూ ఇళయరాజా అంటే భక్తి. తన చిత్రాలకు కుదిరితే ఇళయరాజాతోనే సంగీతం చేయించుకోడానికి ప్రయత్నించేవాడు. ఆ కాంబినేషన్ లో వచ్చిన చిత్రం కీచురాళ్లు. పాప్‌సింగర్స్ కథ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో టైటిల్ సాంగ్ ఉషాఊతుప్‌తో పాడించారు ఇళయరాజా. ఆత్రేయ, ఇళయరాజా కాంబినేషన్‌లో వచ్చిన తెలుగువారి హృదయాలు దోచుకున్న మరో విషాద గీతం *ప్రియతమా నా హృదయమా.* సురేష్‌కృష్ణ డైరక్ట్ చేసిన వెంకటేశ్ చిత్రం ప్రేమ. ప్రేమనగర్‌లో మహాదేవన్ ఆత్రేయ ఫార్ములా ఎలా వర్కౌట్ అయ్యిందో... ప్రేమ విషయంలోనూ రాజా ఆత్రేయ ఫార్ములా వర్కౌట్ అయ్యింది. కావాలంటే ఆ సిన్మా పాట విని మీరే చెప్పండి.

గణేశ్ చతుర్థి సందర్భంగా ప్రతి మండపంలోనూ ... ఆ తొమ్మిది రోజులూ మోగే పాట *దండాలయ్యా ఉండ్రాలయ్యా.* అలా సీతారామ కళ్యాణం పాట కంపోజ్ చేసిన గాలి పెంచల లాగానే ఇళయరాజా కూడా కృతార్థులయ్యారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన *జైజైజై జై గణేశ జైజైజై* వినేద్దామా?

ఎనభై దశకంలో దక్షిణాది చిత్ర సీమలోకి కొత్త ఆలోచనలతో అడుగుపెడుతున్న యువ దర్శకులకు ఉన్న ఒకే ఒక భరోసా ఇళయరాజా. కొత్త దర్శకుల ఆలోచనలను ఆకళింపు చేసుకుని తదనుగుణమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూర్చడంలోనూ...

గీతాలను అల్లడంలోనూ తనదైన ముద్ర చూపించేవారు ఇళయరాజా. మణిరత్నం అగ్నినక్షత్రియం అనే పేరుతో తీసిన ఘర్షణ తెలుగు పాటలు ఆ జనరేషన్ ను ఓ ఊపు ఊపాయి. వాటిలో *రోజాలో లేత వన్నెలో* కూడా ఒకటి. కర్ణాటక సంగీతంలో 15వ మేళకర్త రాగం మాయా మాళవగౌళ రాగం. ఈ రాగంలో ఇళయరాజా ఓ సూపర్ మాస్ హిట్ కంపోజ్ చేశారంటే నమ్మగలరా? సీతారామస్వామీ నే చేసిన నేరము లేమి అంటూ రామదాసు కీర్తన ఈ రాగంలో వినిపిస్తుంది. అయితే సినిమా పాటలకు సంబంధించి జగదేకవీరుడు అతిలోక సుందరి చిత్రంలో *యమహో నీ యమా యమా అందం...*పాటను ఆ రాగ ఛ్చాయల్లో కూర్చడం విశేషం. తొంభై దశకం ప్రారంభంలో ఇళయరాజా చిరంజీవి కాంబినేషన్ లో వచ్చిన రెండు సినిమాల ఆడియో దుమ్ముదులిపేసింది. అందులో రెండోది జగదేకవీరుడు అతిలోక సుందరి. మొదటిది కొండవీటి దొంగ. మాస్ మనసులు గెల్చుకోడానికి పాటలను మోతెక్కించనక్కర్లేదని చాటి చెప్పిన గీతం అది. *పుష్యమి పూవుల పూజ చేస్తా బుగ్గన చుక్కలతో...*లాంటి వేటూరి మార్క్ చమక్కులతో ఎవర్ గ్రీన్ హిట్. ఎలక్ట్రానిక్ గిటార్ , డ్రమ్స్ వాడేస్తే...అదేదో మోడ్రన్ గీతంలే అనుకుంటారంతా... కానీ అక్కడ ఇళయరాజా. ఆధునిక శాస్త్రీయ సంగీతాల మధ్య అద్భుతమైన మేళవింపు ఆయన సంగీతం.

మోహన రాగంలో ఆదితాళంలో స్వరపరచిన నిను కోరీ వర్ణం.. రాజా అందించిన గీతాల్లో ప్రత్యేకమైనది. గీతాంజలికి ముందు చిత్రం కనుక ఘర్షణకు రాజశ్రీతో రాయించుకున్నారు మణిరత్నం. అమల నర్తించిన *నినుకోరీ వర్ణం వినేయండి....* నిజంగానే తెలుగు ప్రేక్షకులు ఆ పాట విన్నప్పుడల్లా *మళ్లీ మళ్లీ ఇది రాని రోజనే* అనుకుంటారు. క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్ లో ఆ నలుగురు... ఇళయరాజా, వేటూరి, చిరంజీవి, లోక్ సింగులు చేసిన సూపర్ హిట్ చిత్రం రాక్షసుడు. సంగీత సాహిత్య సమలంకృతం ఈ కమనీయ గీతం....*మళ్లీ మళ్లీ ఇది రాని రోజు....*

వర్షాన్ని మణిరత్నం ఉపయోగించుకున్నంతగా మరే దర్శకుడూ వాడుకోలేదేమో? గీతాంజలిలో హీరోయిన్ పరిచయానికి వేదికగా వానపాటను ఎంచుకున్నారాయన. సంగీతం ఇళయరాజా. ఇక పాట వింటుంటే... ప్రతి ఒక్కరికీ టీనేజ్ జ్ఞాపకాలు ముసురుకోక తప్పదు. మట్టి నేలల్లో గట్టిగా జల్లుపడ్డప్పుడు... అలా అల్లుకుంటూ పోయే నీటి గీతల వయ్యారాలన్నీ తన ట్యూన్ లో పలికించేస్తారు ఇళయరాజా. పాట వింటుంటే ఒక్కసారి వర్షంలో తడిస్తే బాగుణ్ణనిపించేలా సాగుతుంది ఇళయరాజా వరస. సినిమాపాటల్లో చాలా వరకు ఒడ్డును తాకిన అలల్లా అలా స్మృతి పథం నుంచి వెళ్లిపోతాయి. కొన్ని మాత్రమే హృదయానికి హత్తుకొని మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. కొన్ని పాటలైతే ఎన్నిసార్లు విన్నా ఏదో కొత్తదనం కనిపిస్తూనే ఉంటుంది.

అలా కలకాలం మన జ్ఞాపకాల్లో నిలిచిపోయే పాట రుద్రవీణ తరలిరాద తనే వసంతం... బిహళరి గణపతి శాస్త్రి గారి కొడుకు పనివాళ్లతో కలసి శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆలపించే సందర్భంలో పనిముట్ల సంగీతంతో ప్రారంభించడం అనితరసాధ్యం.

పాట వింటుంటేనే...కళ్లముందు దృశ్యం సాక్షాత్కరించాలి. సంగీత దర్శకుడు స్వరాలతో శ్రోతల హృదయాల్లో ప్రతిష్టించే అక్షర చిత్రాలే పాటలు. *మరో ప్రపంచమే...మరితంచేరువై...నివాళి కోరినా ఉగాది వేళలో... గతించిపోని గాధ నేననీ* అంటూ మృత్యువు ముంగిట్లో వేకువ సంగీతం వినిపించే సందర్భాన్ని తన సంగీతంలో ఆవిష్కరించడం ఇళయరాజాకు తప్ప మరెవరికీ సాధ్యం కాదేమో?

పాట ప్రారంభంలో మంత్రాలతో కలసిపోయిన క్రైస్తవ సంగీతం వినిపించడం ద్వారా చెప్పబోతున్న విషయాన్ని హింట్ చేస్తారు ఇళయరాజా. ప్రేక్షకుల్ని మూడ్ లోకి తీసుకుపోవడం అంటే ఇదే. సీతాకోకచిలుక *మాటే మంత్రమూ...మనసే బంధమూ...*పాట. నేను నీకై ఉన్నాను... అనే దానికి ప్రత్యేకించి పెద్ద తతంగం అవసరం లేదు... మనం పరస్పరం చెప్పుకున్న మాటలే మంత్రాలు...కలసిన మనసులే బంధాలు అంతకు మించేం కావాలనే దర్శకుడి ఊహకు వేటూరితో కలసి ఇళయరాజా తీర్చిన పద చిత్రం ఈ పాట. ఇవ్వాళ ఆ కుర్రాడి బర్త్ డే అంటేనూ కాస్త ఇలా చొక్కా చింపేసుకున్నా పాపం...

- రంగావఝ్జుల భరద్వాజ

# 'వెన్నుపోటు' విజయవంతం



- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పాల్గొన్న వైకాపా శ్రేణులు
- ర్యాలీలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించిన నాయకులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన 147 హామీలు, సూపర్ సిక్స్ అమలుచేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తూ జిల్లాలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ఇన్‌చార్జ్జిలు, మండల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని బుధవారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు జరిపి వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి తహసీల్దార్లకు హామీలు అమలు చేయాలని వినతిపత్రాలను సమర్పించారు. పార్టీ ఆదేశాలతో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులంతా హాజరై కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదని చెప్పి హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.



### ఇచ్ఛాపురంలో..

పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సమక్షంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్జి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు దాసన్నపేట జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించి వైఎస్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం తహసీల్దారుకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, పార్టీ నాయకులు నర్తు నరేంద్ర, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.




### టెక్కలిలో..

నియోజకవర్గ కేంద్రం టెక్కలిలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం నేతృత్వంలో పార్టీ ఇన్‌చార్జ్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినం ర్యాలీని నిర్వహించారు. ముందుగా ఇందిరా గాంధీ కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి పట్టణంలో ర్యాలీ చేసి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు దువ్వాడ వాణి, పేరాడ భార్గవి, ఎంపీపీలు శ్రీరామూర్తి, ఉమా, వెంకటరావు, కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల లక్ష్మణరావు మాస్టారు, టెక్కలి సర్పంచ్, పార్టీ నాయకులు గురునాథ్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### శ్రీకాకుళంలో..

జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనలతో పార్టీ నియోజకవర్గం కేడరంతా కలిసి ఏడు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించి తహసీల్దార్ గణపతికి వినతిపత్రం అందించారు. వైకాపా ర్యాలీకి ఎండీయూ ఆపరేటర్లు హాజరై ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాష్ట్రంలో 18,500 మంది ఆపరేటర్ల కుటుంబాలను రోడ్డుపాలు చేశారని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పెర్సన్ మెంటాడ పద్మావతి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ స్వరూప్, కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పార్టీ నాయకులు మండవిల్లి రవి, ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, యువజన నాయకులు మార్పు పృధ్వీ, ఎంపీపీలు అంబటి శ్రీను, గొండు రఘురాం, ముంజేటి కృష్ణ, నగర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నరసన్నపేటలో..

పోలాకి జెడ్పీటీసీ, యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ




నిర్వహించారు. అనంతరం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, వార్డు సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు హజరయ్యారు.



### పాతపట్నంలో..

పార్టీ ఆదేశాలతో నియోజకవర్గ కేంద్రంలో వైకాపా క్రమశిక్షణ కమిటీ సభ్యులు, పార్టీ ఇన్‌ఛార్జి రెడ్డి శాంతి ఆధ్వర్యంలో కూటమి ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆమదాలవలసలో..

ఇచ్చిన హామీలు అమలు



చేయకుండా ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పద్మజ, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పురపాలక సంఘం వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎచ్చెర్లలో..

నియోజవర్గ కేంద్రం రణస్థలంలో పార్టీ ఇన్‌ఛార్జి గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రిలయన్స్ మార్ట్ నుంచి ర్యాలీ చేపట్టి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల నారాయణరావు, బూరాడ చిన్నారావు, బల్లాడ జనార్ధనరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సివిల్ సర్వెంట్‌నవుతా!

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోడానికి ఆలోచించాల్సిన పరిస్థితి. అందుకే 10 లోపు ర్యాంకు రాలేదు. అయినా సంతోషంగానే ఉంది.

**సత్యం:** ఇంతటి సవాల్ నిండిన పరీక్షకు సన్నద్ధం కావడానికి మీరు ఎలాంటి అధ్యయన వ్యూహాలు, లేదంటే షెడ్యూల్‌ను అనుసరించారు?

**రుత్విక్ సాయి:** ఇది ఒక్కరోజులో సాధించేది కాదు. మొదట్నుంచీ జేఈఈయే లక్ష్యంగా చదివితేనే టార్గెట్‌ను ఛేదించగలం. విజయవాడలో మహానాడు రోడ్డులో కేవలం నాతో పాటు విజయనగరానికి చెందిన మరో విద్యార్థి కోసం ప్రత్యేకంగా పెద్ద ఫ్లాట్‌ను తీసి అక్కడే ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు జేఈఈ పరీక్ష పైన సాధనే. మధ్యలో కేవలం మూడు బ్రేక్‌లే ఉంటాయి. ఒకటి బ్రేక్‌ఫాస్ట్, రెండు లంచ్, డిన్నర్లు మాత్రమే. వేగము, కచ్చితత్వం ఉంటేనే దీన్ని ఛేదించగలం. ఆరు నెలల పాటు మా అమ్మ ఉద్యోగానికి సెలవు పెట్టి నాతోనే ఉండిపోయారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్ష డిస్క్రిప్టివ్ అంటారు కానీ, ఆబ్జెక్టివే. ఆరు మార్కుల ప్రశ్నకు సమాధానం రాబట్టాలంటే మామూలుగా అరగంట పడుతుంది. కానీ జేఈఈ అడ్వాన్స్‌లో రెండు నిమిషాల్లో చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవడమే నైపుణ్యం.

**సత్యం:** మీ సన్నాహక ప్రక్రియలో మీకెదురైన అతి పెద్ద సవాల్ ఏది? దాన్ని ఎలా అధిగమించారు?

**రుత్విక్ సాయి:** ప్రిపరేషన్‌లో మోడల్ పేపర్ సాల్వ్ చేయడానికి ఏరోజూ సమయం సరిపోయేది కాదు. మొదట్లో ఇబ్బంది పడేవాడ్ని. కొన్నింటికి సమాధానం తెలిసినా కూడా సమయాభావం వల్ల పూర్తయ్యేది కాదు. ముఖ్యంగా మ్యాథ్స్‌లో ఈ ఇబ్బంది ఉండేది. ఫిజిక్స్ పూర్తిగా స్కోర్ చేస్తున్నా మ్యాథ్స్‌లో మాత్రం సరిపోయేది కాదు. మెయిన్స్‌కు ఇది ప్రాబ్లం కాకపోయినా జేఈఈ అడ్వాన్స్‌కు మాత్రం ఇదే పెద్ద అవరోధంగా ఉండేది. ఇక మెయిన్ పరీక్షకు సమయం దగ్గరవుతున్నకొద్దీ కేవలం మ్యాథ్స్ మీద దృష్టి సారించి సాల్వ్ చేయడం నేర్పించారు. దీంతో రోజుకు 14 గంటలకు పైబడి సాధన జరిగేది. అప్పటికి కాని సమయం మీద, కచ్చితత్వం మీద పట్టు దొరకలేదు.

**సత్యం:** మీ విజయంలో కీలకపాత్ర పోషించిన ప్రేరణ లేదా స్ఫూర్తి ఏంటి?

**రుత్విక్ సాయి:** మా నాన్న పడుతున్న కష్టాన్ని చూసే దేశంలో గర్వంగా చెప్పుకునే ఐఐటీలో సీటు సాధించాలని భావించాను. మూడో తరగతి చదువుతుండగానే అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్ టైటిల్ గెలుచుకున్నాను. అది చూసిన తర్వాత నాకు టెక్నికల్ అంశం మీద పట్టుందని నాన్న గ్రహించారు. అప్పట్నుంచే ఐఐటీ వైపు నన్ను నడిపారు. అందుకోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఉద్యోగానికి సెలవు పెట్టి అమ్మ, నాన్న లాస్ ఆఫ్ పే అయినా నాతోనే ఉన్నారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోను 10 లోపు ర్యాంకు తెచ్చుకోవాలని కష్టపడ్డాను.

**సత్యం:** మీలాగే ఈ వెనుకబడిన జిల్లాలో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఐఐటీకి వెళ్లాలంటే మీరు ఇచ్చే సలహా ఏంటి?

**రుత్విక్ సాయి:** ఇక్కడ ఆ దిశగా నడిపించే ఫ్యాకల్టీ లేదు. ఉన్నవారు వేరే జిల్లాల్లో వేర్వేరు క్యాంపస్‌లలో పాఠాలు చెబుతున్నారు. అక్కడ మన జిల్లా విద్యార్థులు చదువుతున్నారు కూడా. కానీ ఐఐటీ మెయిన్స్‌ను ఎవరు బ్రేక్ చేస్తారన్న విషయం సంబంధిత విద్యాసంస్థలు ముందే పసిగడతాయి. అటువంటివారిని ఫిల్టర్ చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తాయి. పొరపాటును ర్యాంకు మిస్సవుతుందేమో గానీ, 99 శాతం టార్గెట్ రీచవుతారు. మరీ ముఖ్యంగా జేఈఈకి ప్రిపేర్ కావాల్సిన ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు ఇంగ్లీష్‌లో ఉంటాయి. దీని మీద పట్టు సాధించాలంటే ముందు ఇంగ్లీష్ మీద పట్టు రావాలి. విద్యార్థి కంటే ముందు అధ్యాపకుడికి దీని మీద పట్టు దొరకాలి. నార్త్ ఇండియాలో ఫ్యాకల్టీకి ఈ నాలెడ్జ్ ఎక్కువ కాబట్టి వారిని తీసుకువచ్చి ఐఐటీ పిల్లలకు శిక్షణ ఇప్పిస్తుంటారు. అటువంటి చోట చదివితే జేఈఈ సాధించడం సులభమవుతుంది. ఐఐటీలో సీటు రావాలంటే ఆరో క్లాసు నుంచే ఒక ప్రణాళిక అవసరం. ఆ మేరకు ప్రాక్టీస్ అవసరం. కేవలం ఇంటర్మీడియట్ తర్వాత జేఈఈకి వెళ్తామంటే కష్టమవుతుంది.

**సత్యం:** ఒకపక్క అకడమిక్, మరోపక్క జేఈఈ పరీక్షలకు ప్రిపరేషన్ అంటే ఒత్తిడి అనిపించలేదా?

**రుత్విక్ సాయి:** మొదట్నుంచి నన్ను జేఈఈ అడ్వాన్స్‌కే ప్రిపేర్ చేశారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు ఐదు రోజుల ముందు పుస్తకాలిచ్చారు. సెకండియర్‌కైతే నాలుగు రోజుల ముందు ఇచ్చి చదవమన్నారు. ఒకసారి జేఈఈ టార్గెట్ అయితే, అకడమిక్ లెక్కలోకే రాదు. ఏపీ ఎంసెట్‌కైతే పేపరు ఏ మోడల్‌లో ఉంటుందో ఒకసారి చూసుకోమన్నారు. అలాగే పరీక్షకు వెళ్లాను. అది కూడా చాలా చిన్న ర్యాంకు వస్తుందని భావిస్తున్నాను. తెలంగాణ ఎంసెట్‌కు కూడా ప్రిపేర్ కాలేదు. ఆ ముందురోజే కాలికి గాయం కావడంతో కోదాడ వెళ్లి పరీక్ష రాశాను. 45వ ర్యాంకు వచ్చింది. జేఈఈయే టార్గెట్ అయితే, మీగతావేవీ ఒత్తిడే కాదు.

**సత్యం:** మీ దీర్ఘకాలిక లక్ష్యాలేమిటి? ఈ ర్యాంకు మీ కెరీర్ ఆకాంక్షలకు ఎలా ఉపయోగపడుతుంది?

**రుత్విక్ సాయి:** ముందుగా ఐఐటీ ముంబయిలో సీఎస్ఈలో చేరుదామనుకుంటున్నాను. రెండు నెలల్లో అది పూర్తవుతుంది. ఐఐటీ క్యాంపస్‌కు వెళ్లిన తర్వాత సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతాను. సివిల్ సర్వెంట్ కావడమే నా దీర్ఘకాల లక్ష్యం. ఇప్పుడు వచ్చిన ర్యాంక్ అంటారా.. ముంబయి లాంటి సుప్రసిద్ధ ఇన్‌స్టిట్యూట్‌లో చేరడానికి నాకు ఉపకరిస్తుంది. అక్కడి నుంచి మరింత ఫోకస్డ్‌గా సివిల్స్ వైపు వెళ్లడానికి ఆ వాతావరణం పనికొస్తుందని భావిస్తున్నాను.

# బటన్ బద్ధలైన రోజు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత ప్రభుత్వం కక్ష సాధిస్తుందని మాత్రం భావించడంలేదు. ఎందుకంటే నాణ్యమైన మద్యం దొరక్క, డిజిటల్ చెల్లింపులు లేక, టాక్స్ పేయర్ అనే గౌరవం దక్కక అప్పటి ప్రభుత్వాన్ని తిట్టుకోని రోజు లేదు. చివరకు వల్లభనేని వంశీని మరీ అంత హింసించడం సరికాదని సానుభూతి వ్యక్తం చేస్తున్న ఓటరు మద్యం కుంభకోణం మీద మాత్రం ఇంకా పాత్రధారులు కూడా బయటకు రావాలని కోరుకుంటున్నాడు. అలాగే గత ఐదేళ్లలో ఇసుక దొరక్క ఎన్ని వేల నిర్మాణాలు ఆగిపోయాయో వేరేగా చెప్పనక్కర్లేదు. తమ ప్రాంతంలో ఉన్న నదిలో ఇసుక తమ కళ్లముందే వేరే జిల్లాలకు చెందినవారు భారీ వాహనాలపై తరలించుకుపోతుంటే కళ్లు లేని కబోదిలా వ్యవహరించాల్సిన పరిస్థితి సగటు జిల్లా వాసిది. జేపీ వెంచర్స్ అని, మరోటని, మరోటని సంస్థలను దించి ఇక్కడ నదీ తల్లుల గర్భాన్ని చీల్చేశారు. ఇది స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని ఇక్కడ జిల్లా నేతలు జగన్‌కు చెబుదామంటే ముందు కోటరీ దాటి వెళ్లనిచ్చేవారెవరు? సంక్షేమ పథకాలు మాత్రమే ఓట్లు రాల్చవని ధర్మానకు ముందే తెలుసు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ఒక కుటుంబానికి జగన్మోహన్‌రెడ్డి ద్వారా ఎంత లబ్ధి జరిగిందన్న డేటాతో కూడిన పుస్తకాన్ని నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులకు అందించారు. అప్పుడే నాలుగు డివిజన్లు తిరిగిన ధర్మానకు సీన్ అర్థమైపోయింది. ఏడాదికి రూ.12 లక్షలు పైబడి లబ్ధి పొందిన కుటుంబాల మొహాల్లో కూడా వెలుగులు లేకపోవడం ఆయన గమనించారు. అయితే పార్టీలో ఈ మాట చెబితే విన్నది ఎవరు? అలాగే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలతో కూడిన స్టిక్కర్‌ను అంటించి లబ్ధి జరిగితే అందులో ఉన్న నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని చేసిన ప్రచారంలో స్వతంత్రంగా స్పందించిన లబ్ధిదారులంతెమంది? వార్డు వాలంటీర్ల మెడ మీద కత్తిపెట్టితే మిస్డ్‌కాల్ ఇచ్చినవారు ఎంతమంది? అన్న విషయం ఆ సీజన్‌లోనే తేలిపోయింది. కాకపోతే జగన్మోహన్‌రెడ్డి పంపకాల స్థాయి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉండటం వల్ల ఓటరు ఆ ఇంటిలోనే ఉన్నారన్న భ్రమలో పడిపోయింది కేడర్. ఒకవైపు పార్టీ అధికారంలో ఉన్నా, తమను ఆర్థికంగా బలోపేతం చేయలేదని బాధపడుతూనే మరోవైపు జగన్మోహన్‌రెడ్డిని కొట్టేవాడు లేరనే భ్రమలోకి వెళ్లిపోయారు. కానీ కెరీర్ ప్రారంభం నుంచి ఇలాంటి ఎన్నికలు, ఎందరో నాయకుల్ని చూసుకొచ్చిన ధర్మాన లాంటివారికి మాత్రం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసు. కానీ ఆయన్ను అడిగేవాడెవరు?

### గేమ్ ఛేంజర్ పవన్

సరిగ్గా ఇటువంటి సమయంలోనే చంద్రబాబును అరెస్ట్ చేయించి గత ప్రభుత్వం పెద్ద తప్పు చేసింది. ఇక్కడ స్కిల్ కుంభకోణం జరిగిందా? లేదా? అన్న విషయానికి పోవడంలేదు. కానీ ఎన్నికల ముందు చంద్రబాబును అరెస్టు చేయడమనేది రాజకీయంగా ఆత్మహత్యాసదృశమే. అప్పట వరకు ఉప్పు, నిప్పులా బీజేపీ, టీడీపీలకు సయోధ్య కుదిర్చి ఓటు చీలకుండా చేయడం వల్లేల కూటమి అన్ని స్థానాలను, అంత ఓటింగ్‌ను దక్కించుకో గలిగింది. దీనికి తోడు 70 మందికి పైగా అభ్యర్థులను మార్చడం, స్థానికేతరులను దించడం వైకాపా ఓటమికి ఒక కారణం. పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, వైద్యం వంటి విషయాల్లో మంచి చేసినా, రోడ్ల దుస్థితి ముందు ఇవి దిగదుడుపైపోయాయి. అన్నిటికీ మించి చంద్రబాబు సామాజిక భద్రతా పింఛను రూ.4వేలు చేస్తామనడం పెద్దఎత్తున ఓటు ట్రాన్స్‌ఫర్‌కు కారణమైంది.

### పాలనే అగ్నిపరీక్ష

గడిచిన ఎన్నికల్లో కూటమి పార్టీలతో సంబంధం లేకుండా కేవలం తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కటే ప్రభుత్వం ఏర్పాటుకు పూర్తి మెజార్టీ సంపాదించింది. అదలా ఉంచితే బాబు ప్రకటించిన ఎన్నికల ప్రణాళికను అమలుచేయడం సాధ్యమేనా? ఉమ్మడి ఎన్నికల ప్రణాళికను అమలుచేయడానికి ఏటా రూ.1.60 లక్షల కోట్లు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు సంపదను ఎలా సృష్టిస్తారు? సూపర్‌సిక్స్ ఫార్ములాను ఎలా అమలుచేస్తారనేదే ఏడాదైనా అర్థంకాని భేతాళ ప్రశ్న. జగన్మోహన్‌రెడ్డి తప్పిదాల వల్ల అధికారం సులువుగా వచ్చినా పాలనే తలకు మించిన భారంగా ఉంది. ఇప్పటికీ ఫ్రీగ్యాస్ సిలెండర్లు, సామాజిక పింఛన్లు తప్ప సూపర్‌సిక్స్‌లో మిగిలిన పథకాలు అమలుకాలేదు. ఈ విద్యాసంవత్సరం నుంచి తల్లికి వందనం అని చెబుతున్నారు. ఆగస్టులో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారు. ఇవి అమల్లోకి వచ్చేవరకు గ్యారెంటీ లేదు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు, జిల్లాలో కొత్త పనుల ప్రారంభం వంటివాటిలో జగన్మోహన్ రెడ్డి పాలనకు, కూటమి ప్రభుత్వానికి తేడా కనిపించడంలేదు. కాకపోతే రాష్ట్రంలో ఏం జరిగినా నిమ్మకు నీరెత్తినట్టుండే జగన్మోహన్‌రెడ్డికి, అప్పటి ప్రతిపక్షం మీద విరుచుకుపడటానికి తప్ప ప్రజా సమస్యలపై నోరెత్తని మంత్రులకు, ఇప్పటి పాలకులకు మధ్య స్పష్టమైన తేడా అయితే కనిపిస్తుంది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గాని, మరో పవర్ సెంటర్ లోకేష్‌కు గాని సమస్య విన్నవించుకుంటే దానిపై వారు స్పందిస్తున్న తీరు మాత్రం ఊరట కలిగించే అంశం.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.